

మహిళా సాధికారతకు పెద్దపీట

కడప : జగనన్న ప్రభుత్వంలోనే మహిళా ఆర్థిక స్వావలంబన సాధికారతకు పెద్ద పీట వేశామని సంక్షేమం పథకాలను తెలుసుకొని సామాజికంగా, ఆర్థికంగా లబ్ధి పొందాలని ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ అన్నారు. బుధవారం సాయంత్రం నగరంలోని 43వ డివిజన్ పరిధిలోని కార్పొరేటర్ ఎ. శ్రీలేఖ, ఇన్ ఛార్జి పి.రెడ్డి ప్రసాద్ ఆధ్వర్యంలో రవీంద్ర నగర్ సచివాలయం-5 పరిధిలోని కాగితాలపెంటలోని పలు వీధులలో గడపగడపకు మన ప్రభుతవం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్, నాయకులు, అధికారులతో కలిసి ఆయా వీధుల్లో నివాసాలన్నింటినీ తిరిగారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో నేరుగా మాటాడారు. పథకాల లబ్ధి సమాచారంతో కూడిన బుక్ లెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఇబ్రహీం మియా, డైరెక్టర్ బంగారు నాగయ్య యాదవ్, కార్పొరేటర్లు బాల స్వామిరెడ్డి, అఫ్జల్ ఖాన్, తోట కృష్ణ, వాలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ లక్ష్యాన్ని సాధించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్ రామరాజు

ప్రణాళికతో గృహ నిర్మాణ లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సభాభవన్‌లో జెసి సి.ఎం. సాయికాంత్‌వర్మ, మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్, జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా, హౌసింగ్ పీడీ. కృష్ణయ్యతో కలిసి జగనన్న హౌసింగ్ కాలనీల్లో గృహ నిర్మాణ పనుల పురోగతి, మౌలిక వసతులు, జగనన్న సంపూర్ణ గృహహక్కు, ఒటిఎస్ ప్రక్రియల యాక్షన్ ప్లాన్‌తో పాటు. అభివృద్ధి పనులు, పథకాల అమలు తీరు, పురోగతి వంటి వాటిపై ఆర్‌డిఒలు, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులతో నేరుగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టి అమలు చేస్తున్న సేవలు, సంక్షేమ పథకాలు వారికి సంతృప్త స్థాయిలో అందాలనే ప్రభుత్వ లక్ష్యం మేరకు ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పని చేయాలన్నారు. మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు లక్ష్య సాధన కోసం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి వారమూ ప్రగతి నివేదికలు అందజేయాలన్నారు. ప్రధానంగా జగనన్న హౌసింగ్ కాలనీల నిర్మాణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయా మండలాలు, మున్సిపాలిటీల పరిధిలోని లే అవుట్లలో గృహ నిర్మాణ పనుల పురోగతిపై ఒక్కొక్కరిని అడిగి తెలుసుకున్నారు. అధికారులు సమావేశనికి వచ్చేముందు సమగ్ర నివేదికలతో, అవగాహన కలిగి అడిగిన ప్రశ్నలకు కచ్చితమై సమాధానం చెప్పాలని అన్నారు. పేదల ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి కనిపించాలని, వెనకబడితే చర్యలు తప్పవని అన్నారు. ప్రారంభంకాని ఇళ్లన్నీ సత్వరమే ప్రారంభించి బిబిఎల్ స్థాయిలో ఉండేలా చూడాలన్నారు. పేదల ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఇంపార్టెన్స్ ఇస్తుందనే విషయాన్ని ప్రతి ఒక్కరు దృష్టిలో పెట్టుకోని పనిచేయాలని పేర్కొన్నారు. జగనన్న గృహ నిర్మాణాలలో ముఖ్యంగా విద్యుత్, నీటి సరఫరాకు త్వరితగతిన అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు. గృహ నిర్మాణ శాఖ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో రోజూ సమీక్ష చేయాలన్నారు. గృహ నిర్మాణ పనుల్లో అధికారులు చిత్త శుద్ధితో పనిచేసి నిర్దేశించిన, ఆశించిన పురోగతిని చూపాలని అన్నారు. ప్రాధాన్యత భవన నిర్మాణాల పై ప్రత్యేక దృష్టి పెట్టి పనులు పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో కడప, బద్వేలు, జమ్మలమడుగు, పులివెందుల ఆర్‌డిఒలు ధర్మ చంద్రా రెడ్డి, వెంకట రమణ, శ్రీనివాసులు, వెంకటేష్, మండల ప్రత్యేకధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడివోలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ నమూనా పరీక్ష విజయవంతం

ప్రజాశక్తి - కడప అర్బన్



ప్రశ్న పత్రాలు ఆవిష్కరిస్తున్న డివైఎఫ్ నాయకులు

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కానిస్టేబ్ నమూనా పరీక్ష విజయవంతమైంది. బుధవారం డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌విడిసి డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ పోలీస్ కానిస్టేబుల్ నమూనా పరీక్షలను డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం. చిన్ని, వి. శివకుమార్ టీమ్ ఏర్పాటు చేసింది. ముఖ్య అతిథిగా డివైఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి జి. చంద్రశేఖర్ హాజరయ్యారు. ప్రశ్నా పత్రాలను అభ్యర్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్ష విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అర్హత కలిగిన విద్యావంతులైన నిరుద్యోగులందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించడం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యతని వారు గుర్తు చేశారు. పోటీ పరీక్షల ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యం నేటి నిరుద్యోగ విద్యావంతులైన యువతి, యువకులకు అవసరమని, చెప్పారు. ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్), ఎమ్మెల్సీ లక్ష్మణరావు సారథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగ విద్యావంతులకు 'మోడల్ నమూనా పరీక్షలు' నిర్వహిస్తూ ఉందని పేర్కొన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాల కోసం డివైఎఫ్ఐ చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు. జిల్లాలోని బద్వేలు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు, పోరుమామిళ్ల, కడప నగరాలలో ఈ నమూనా పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు షాకీర్, ఓబులేసు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు ఎం.ఆర్. నాయక్ , ఎస్.రాజేంద్రప్రసాద్, కడప నగర అధ్యక్షులు సురేష్ నాయక్, మాజీ యువజన నాయకులు సుబ్బరాయుడు పాల్గొన్నారు. ఎస్‌విడిసి యాజమాన్యం ఈ నమూనా పరీక్షలకు అబ్జర్వర్లుగా వారి కళాశాల లెక్చరర్స్‌ను పెట్టడం సంతోష కరమన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నటువంటి నమూనా కానిస్టేబుల్ పరీక్ష విజయవంతంగా జరిగిందని డివైఎఫ్ఐ పట్టణ ఉపాధ్యక్షులు ప్రసాద్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్ కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక ఎస్‌పి డిగ్రీ కళాశాలలో ప్రశ్న పత్రాన్ని ముఖ్యఅతిథిగా హాజరైన సృజన్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ సృజన్ విడుదల చేశారు. సందర్భంగా సృజన్ మాట్లాడుతూ ప్రతిభను కనపరచడంలో అవగాహన కల్పించడంలో డివైఎఫ్ఐ వారు ముందు ఉండడం సంతోషకరం అన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు సాయి, మహేష్ పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** పట్టణంలోని సృజన, శ్రీచక్ర, పూర్ణ కోచింగ్ సెంటర్లలో డివైఎఫ్ఆధ్వర్యంలో పోలీస్ కానిస్టేబుల్ పరీక్షా నమూనా పరీక్షలు నిర్వహించారు. సుమారు 300 మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు. ముందుగా జనవిజ్ఞానవేదిక (జెవివి) రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్‌రెడ్డి, జెవివి ఆరోగ్యవిభాగం చక్రధర్ పశ్నా పత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్‌రాజ్, సురేంద్ర, చెన్నయ్య, శివ,రమేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ భవన్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి - కడప అర్బన్



సమావేశంలో మాట్లాడుతున్న రామమోహన్

రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి చేపడుతున్న బహిరంగ విచారణలో 2023- 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లోటును రూ.13వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం భరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19న విద్యుత్ భవన్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్నట్లు సిపిఎం నగర కార్యదర్శి ఎ.రామమోహన్ తెలిపారు. బుధవారం సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ నియంత్రణ మండలి ఈనెల 19 నుంచి 21 వరకు విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి నగరాల్లో బహిరంగ విచారణ చేపడుతోందన్నారు. ఈ బహిరంగ విచారణకు ముందే సిపిఎం తన అభిప్రాయాన్ని, సూచనలను తెలియజేస్తుందన్నారు. 2023 - 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లోటును విద్యుత్ పంపిణీ సంస్థలు చూపుతున్నాయని తెలిపారు. ఈ లోటు రూ.13వేల కోట్లు ఉందని చెబుతున్నారన్నారు. దీనిని రాష్ట్ర ప్రభుత్వమే సబ్సిడీగా భరించాలని, ఆ మేరకు ప్రజానీకం మీద భారం పడకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ట్రూ ఆప్ ఛార్జీల పేరుతో ప్రతినెలా విద్యుత్ బిల్లుల్లో అదనపు భారం మోపుతున్నారని అన్నారు. ఈ ట్రు అప్ ఛార్జీల భారాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ మోటార్లకు మీటర్ల బిగించే ప్రతిపాదన కూడా రైతాంగానికి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని చెప్పారు. స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్ల ఏర్పాటును ఆపాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు విద్యుత్ రాయితీ కొనసాగించేలా చూడాలని డిమాండ్ చేశారు. పై సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ఆందోళన జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు పి. చంద్రారెడ్డి, నగర కమిటీ సభ్యులు ఓబులేసు, పరుక్ హుస్సేన్ పాల్గొన్నారు.


ఆదాయపు పన్ను సాఫ్ట్‌వేర్‌ను ప్రారంభిస్తున్న రామచంద్రారెడ్డి

ఆదాయపు పన్ను పరిమితిని పెంచాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

వ్యక్తిగత ఆదాయపు పన్ను పరిమితిని రూ.5 లక్షలకు పెంచాలని, అలాగే పొదుపులను రూ.3 లక్షలకు పెంచాలని మాజీ ఎమ్మెల్సీ పోచం రెడ్డి సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వి. రామచంద్రారెడ్డి కార్యాలయంలో ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో తయారుచేసిన ఆదాయపన్ను సాఫ్ట్‌వేర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం దాదాపు 8 సంవత్సరాలుగా ప్రవేశపెట్టిన ఏ బడ్జెట్ లోనూ వ్యక్తిగత ఆదాయపన్ను పరిధిని పెంచిన దాఖలాలు లేవని తెలిపారు. ప్రతి సంవత్సరమూ జిమిక్కులు చేస్తూ ఉందని అన్నారు. గతంలో ఈ ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉండంగా వ్యక్తిగత ఆదాయపన్ను పరిధి అయిదు లక్షలకు పెంచాలని డిమాండ్ చేసిందని, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఒక్క రూపాయి కూడా ఆదాయపన్ను పరిధిని పెంచలేదని అన్నారు. పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎం.వి. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ తమ కార్యాలయంలో ఉపాధ్యాయులందరికీ ఉచితంగా చేసి ఇన్కమ్ టాక్స్ రిటర్న్స్ ఇస్తారని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షులు లెక్కల జమాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, పెట్రోల్ ధరలకు అంతే లేదని చెప్పారు. వ్యక్తిగత ఆదాయపన్ను మాత్రం కేంద్ర ప్రభుత్వం పెంచకపోవడం దారుణమన్నారు. మధ్యతరగతి వర్గం ఈ ధరలతో ఎలా బతుకు ఈడుస్తుందని అనే ఆలోచన లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం భవిష్యత్తు ఎన్నికలలో దృష్టిలో పెట్టుకుని ఆదాయ పన్ను పరిధిని పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రామాంజనేయరెడ్డి, అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జక్రియ, వైఎస్ఆర్ జిల్లా గౌరవ అధ్యక్షులు రామలక్ష్మి రెడ్డి, బాధ్యులు నారాయణరెడ్డి, లక్ష్మయ్య,ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే పథకాలు : ఎమ్మెల్యే

కడప : కొత్తగా నియమించిన సచివాలయ కో-ఆర్డినేటర్లు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికీ చేరేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పి. రవీంద్రనాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం కడపలోని వైసిపి జిల్లా పార్టీ కార్యాలయంలో కమలాపురం నియోజకవర్గానికి చెందిన 16, 17, 18, 45, 49, 50 డివిజన్లు సచివాలయం కో-ఆర్డినేటర్లతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా నియమించిన కో - ఆర్డినేటర్లు ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడూ తెలుసుకుని పరిష్కరించాలన్నారు. పరిష్కరం కాకపోతే తన దృష్టి కి తీసుకొని వస్తే వాటిని వెంటనే పరిష్కరిస్తానని తెలియజేశారు. మీ లక్ష్యం ప్రజలకు సేవ చేయడమేనని చెప్పారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

కడప : కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం ఇందిరానగర్ పద్మావతి వృద్ధాశ్రమంలో వృద్ధులకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నీలి శ్రీనివాసరావు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుద్రరాజు నేతృత్వంలో కాంగ్రెస్ రాష్ట్రంలో బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈనెల 26వ తేదీ నుంచి పాదయాత్రలు చేపడతామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు మల్లెం విజయభాస్కర్, పిసిసి డెలిగేట్ తిరుమలేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ గౌడ్, జిల్లా కార్యదర్శి సూర్యుడు, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు ఆనంద్ పాల్గొన్నారు.

రేపు రైతు సంఘం రౌండ్ టేబుల్ సమావేశం

కడప అర్బన్ : ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 20న ఉదయం 10 గంటలకు పాత బస్టాండ్ రైతు సంఘం జిల్లా కార్యాలయంలో 'మద్దతు ధరలు - చట్టబద్ధత - కేంద్ర ప్రభుత్వ వైఖరి' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరి రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశంలో రైతాంగ సమస్యలపై ఈనెల 26న నిరసన ర్యాలీ పై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. సమావేశానికి అఖిలపక్ష రైతు సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని పేర్కొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించండి: ఎఆర్ ఎఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్


పోలీసుల గౌరవ వందన స్వీకరిస్తున్న అదనపు ఎస్‌పి కృష్ణారావు

విధుల్లో వృత్తి నైపుణ్యం పెంపొందించుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని ఎఆర్ అదనపు ఎస్‌పి ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, ఏఆర్ పోలీసు సిబ్బందికి సూచించారు. జిల్లా సాయుధ పోలీసు బలగాలకు రెండు వారాల పాటు నిర్వహించే 'మొబలైజేషన్' కార్యక్రమాన్ని జిల్లా ఎస్.పి అన్బురాజన్ ఆదేశాల మేరకు ఆయన బుధవారం స్థానిక పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ పోలీసులు చేసే ప్రతీ పనిలోనూ ఎంతో నేర్పరితనం, సమయస్ఫూర్తి, నైపుణ్యంతో కూడుకుని ఉంటాయన్నారు. ఇతర ఉద్యోగాల కంటే పోలీసు ఉద్యోగం భిన్నంగా ఉంటుందని, ప్రజలు మనపై పెట్టుకున్న ఆశలు ఏమాత్రం సడలకుండా క్రమశిక్షణతో మెలగాల్సి ఉంటుందన్నారు. ఎఆర్ సిబ్బందికి ప్రతీ ఏటా మొబలైజేషన్ కార్యక్రమం నిర్వహించి విధుల్లో నైపుణ్యం, ఫిజికల్ ఫిట్ నెస్ ను మెరుగుపరచడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఉద్యోగంలో చేరే ముందు శిక్షణలో నేర్చుకున్న తర్ఫీదు అంశాలను మరోసారి గుర్తు చేసుకుంటూ మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దుకునేందుకు కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. తక్కువ శ్రమతో ఎక్కువ ఫలితాలిచ్చే విధంగా సామర్థ్యాలను పెంపొందించుకోవాలన్నారు. బిడి టీం, ప్రిజనర్స్ ఎస్కార్ట్ , పిఎస్ఒ లు, డ్రైవర్స్, తదితర సిబ్బంది బాగా మెరుగు పరుచుకోవాలని సూచించారు. ఫైరింగ్ , డ్రిల్ , కవాతు, మాబ్ కంట్రోల్ , ప్రముఖుల బందోబస్తు, తదితర విధులు మరింత సమర్థవంతంగా నిర్వహించేలా తర్ఫీదునిస్తారన్నారు. ఇదే సమయంలో మొబలైజేషన్‌కు వచ్చిన సిబ్బంది సంక్షేమం, ఆరోగ్య సమస్యలపై కూడా దృష్టి సారించామన్నారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి బి.రమణయ్య, ఆర్ఐ లు వీరేష్, సోమశేఖర్ నాయక్, ఆర్ఎస్ఐలు, ఎఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - వల్లూరు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని డిఐఒ డాక్టర్ మల్లేశ్వరి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సిహెచ్ మునిరెడ్డితో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో కాన్పుల గది , మరుగుదొడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రం పరిసరాల్లో పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వం అందించిన వార్డ్ కర్టెన్స్ మంచాలపై దుప్పట్లు, దిండు కవర్లు రోజువారీగా మార్చాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసన్నలక్ష్మి , సి.హెచ్ వేణుగోపాల్, హెల్త్ సూపర్‌వైజర్ శివరామిరెడ్డి, హెచ్ఎస్ మమత, నిర్మల, అనిత, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అభివృద్ధి చెప్పకోవడానికే : టిడిపి

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప నగరం అభివృద్ధి చెందిందని చెప్పుకోవడానికి వైసిపి నాయకులకు సిగ్గు ఉండాలని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం నగరంలో గౌస్ నగర్‌లో కెసి కాలువను చూసి ప్రజలు పడుతున్న బాధలను అడిగి తెలు సుకున్నారు. కాలువలో మురికి తీయకుండా ఏళ్ల నుంచి దోమలతో అల్లాడుతున్నారని పేర్కొన్నారు. జ్వరాలు వచ్చి ఇబ్బంది పడుతున్నాం అని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని వాపోయారు. నగరం అభివృద్ధి చెందిందని ప్రగల్బాలు పలికే నాయ కులకు ఈ మాత్రం చెత్తాచెదారం కన్పించలేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలను దృష్టిలో పెట్టుకుని కెసి కాలువను శుభ్రపర చాలన్నారు. ఇంతటి ఘోరమైన పరిస్థితి ఉన్న కూడా పాలకులు మాత్రం నిమ్మకునీరేతినట్టు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. కార్పొరేషన్ అధికారులు దీని పై స్పందించాలని, ప్రజలకు ఇబ్బంది కల కుండా కేసి కాలువ ఆధునికరణ చేసి శుభ్రపరచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిలాని బాష, ఎంపీ సురేష్, పాలంపల్లె సుబ్బారెడ్డి, జమీల్, మసాపేటశివ, సుబ్బారాయుడు, ఆఫ్జల్, అనిల్ పాల్గొన్నారు.


మురుగవంక కాల్వలో ఉన్న చెత్తను పరిశీలిస్తున్న శ్రీనివాసరెడ్డి

దహన సంస్కారాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-చెన్నూరు

మండలంలోని రామనపల్లి గ్రామం దళితవాడలో తలమల నరసమ్మ అనే మహిళ బుధవారం మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న అంబేద్కర్ సేవా సంఘం అధ్యక్షులు గురయ్య గ్రామస్తులు సమక్షంలో అంబేద్కర్ సేవా సంఘం ఆధ్వర్యంలో మృతురాలి అంత్యక్రియల కోసం రూ. 2 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సేవా సంఘం అధ్యక్షులు గురయ్య మాట్లాడుతూ, అంబేద్కర్ సేవ ఆధ్వర్యంలో దళితులు ఎవరైనా రామన పల్లి దళితవాడలో మరణిస్తే వారికి అండగా తమ వంతు సహాయంగా దహన సంస్కారాల నిమిత్తం రూ. 2వేలు అందజేస్తామని చెప్పారు. ఆ కుటుంబానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు, కార్యక్రమంలో అంబేద్కర్ సేవా సంఘం సెక్రటరీ పి, పెంచలయ్య కోశాధికారి వై.బ్రహ్మయ్య , గ్రామస్తులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

కలసపాడు : మండలంలోని రైతులు రైతు భరోసా కేంద్రంలో పంట నమోదు చేసుకోవాని ఎఒ ఎం. సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుతం రబీ సీజన్లఓ 3 వేల ఎకరాల్లో వరి, సజ్జ, నూగు, పతి, జొన్న వంటి పంటలు సాగు చేశారని చెప్పారు. రైతులందరికీ రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలంటే ప్రతి ఒక్కరూ ఇకెవైసి తప్పక చేసుకోవాలన్నారు. జిరో వడ్డీ, రైతు భరోసా, పిఎంకిసాన్, వంటి ప్రభుత్వ పథకాలు పొందాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్ జె. సింగరయ్య పాల్గొన్నారు.


హెల్ప్ డెస్క్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సిఎం అంజాద్ బాషా

'ఆరోగ్యశ్రీ' పేదలకు వరం

- ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా

ప్రజాశక్తి - కడప అర్బన్

డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం పేదలకు బృహత్తర వరమని, ప్రతి పేద బడుగు బలహీనవర్గాల ప్రజలు వినియోగించుకొని లబ్ధి పొందాలని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా అన్నారు. బుధవారం శ్రీ శ్రీ హోలిస్టిక్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ హెల్ప్ డెస్క్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 80 శాతం పైబడిన ప్రజలందరికీ 2500 వ్యాధులకు సంబంధించి ఆరోగ్యశ్రీ వర్తించేవని, వాటిని ప్రస్తుతం 3500కు చేర్చారని ప్రతి రూ.1000 దాటితే ఆరోగ్యశ్రీ పథకం వర్తించేలా, ఆరోగ్యశ్రీని క్షేత్రస్థాయిలో మెరుగులు దిద్దుతూ ముందుకు వెళ్లడం జరుగుతోందని చెప్పారు. అనంతరం ఆసుపత్రి సిబ్బంది, అధికారులు, ఆరోగ్య మిత్రులకు పలు సూచనలు, సలహాలు జారీ చేశారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ కె.నాగరాజు, హోలిస్టిక్ ఆసుపత్రి డాక్టర్. శ్రావణ్ కుమార్, డాక్టర్ మోహన్ రావు, డాక్టర్ క్రాంతి కుమార్, వైకాపా నాయకులు అఫ్జల్ ఖాన్, నారపురెడ్డి సుబ్బారెడ్డి, ఎన్.ఆర్.ఐ. తోట కృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

ఇకెవైసిపై ఆందోళన వద్దు

ప్రజాశక్తి - కడప అర్బన్


డైరీ ఆవిష్కరిస్తున్న ట్రెజరీ అధికారి

ఎపి ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు చెన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామ మూర్తి నాయుడు ఆధ్వ ర్యంలో జిల్లా ఖజానా అధికారి వెంకటేశ్వరరావు డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సబ్ ట్రెజరీ అధికారి రవికుమార్, అనిల్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు నాగముని రెడ్డి, బాల ఎల్లారెడ్డి, బాలసుబ్రమణ్యం, కోశాధికారి నగేష్ పాల్గొన్నారు. ఇకెవైసి పట్ల పెన్షనర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధ్యక్షులు చెన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామమూర్తి నాయుడు చెప్పారు.

'ఉమ' కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

యునైటెడ్ మైనారిటీ ఎంప్లాయిస్ అసోసియేషన్(ఉమ) అఫ్ ఆంధ్రప్రదేశ్ కేలండర్- 2023ను నగరం లోని సంఘం ఫంక్షన్ హాల్‌లో బుధవారం అల్లూరి సీతారామ రాజు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్. జమాల్ బాష ఆవిష్కరించారు. 'ఉమ' రాష్ట్ర అధ్యక్షులు నాయబ్ షంషుద్దీన్ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2012వ సంవత్సరంలో నవ్యాంధ్ర ప్రదేశ్‌లోని మైనారిటీ సామాజిక వర్గానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం, సమైక్యత లక్ష్యంగా 'ఉమ' సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు అనంతరం 'సంఘ సభ్యులు డాక్టర్ జమాల్ బాషను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కడప జిల్లా అధ్యక్షులు బాషాఖాద్రి, ప్రధాన కార్యదర్శి మహబూబ్ ఖాన్, రాష్ట్ర కార్యదర్శి ఆరిపుల్లా, ఇంతియాజ్, చాన్ బాష, అబ్బాస్ అలి, గఫూర్, తాజుద్దీన్ పాల్గొన్నారు.

అండర్ -14 రాష్ట్ర జట్టుకు ముగ్గురు ఎంపిక

ప్రజాశక్తి - కడప



ఆంధ్ర రాష్ట్ర అండర్- 14 క్రికెట్ జట్టుకు కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్‌కు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎన్. విష్ణుసాయి (వికెట్ కీపర్), గౌస్ గరి గైబు (మీడియం పేస్ బౌలర్), ఏ. శ్రీ సాయి చరణ్ రెడ్డి (మీడియం పేస్ బౌలర్) ఎంపికయ్యారు. ఈనెల 23న కేరళలో జరగబోయే అంతర్ రాష్ట్రాల మల్టీ డే క్రికెట్ మ్యాచ్లలో ఈ ముగ్గురు క్రీడాకారులు ఆంధ్ర జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. జిల్లా క్రికెటర్ అసోసియేషన్కు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఆంధ్ర జట్టుకు ఎంపిక కావడం పట్ల జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం. భరత్ రెడ్డి, కార్యదర్శి ఏ రెడ్డి ప్రసాద్, డిసిఓఎస్. కాజా మైనుద్దీన్ హర్షం వ్యక్తం చేశారు. అంతర్ రాష్ట్రాల క్రికెట్ టోర్నమెంటులో మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

రహదారి భద్రత వారోత్సవాలు

ప్రజాశక్తి- కడప అర్బన్

ఎస్పి అన్బురాజన్ ఆదేశాల మేరకు వన్ టౌన్ పరిధిలో '34 వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలు' సందర్భంగా బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ వాహన దారులు ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పక పాటించాలని పేర్కొన్నారు. సీట్ బెల్ట్ ధరించాలని, ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల వల్ల ఒక కుటుంబం ఆర్థికంగా ఎంతో నష్టపోతుందని చెప్పారు. కుటుంబ పెద్ద తీవ్రంగా గాయపడితే కుటుంబ సభ్యుల మనో వేదన లాంటి దుస్థితి ఎవ్వరికీ రాకూడదన్నారు. అందరూ తమ వంతు బాధ్యత గా రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేడు వైవీయూలో వేమన జయంతి

ప్రజాశక్తి- కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయంలో ఈ నెల 19న 'వేమన జయంతి ఉత్సవం' నిర్వహిస్తున్నట్లు తెలుగు శాఖ అధిపతి ఆచార్య జి. పార్వతి ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె. హేమచంద్రారెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. సభాధ్యక్షులుగా విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి విసి జి. రంగ జనార్దన్, ప్రత్యేక ఆహ్వానితులుగా రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. ప్రధానవక్తగా మైసూరులోని కర్ణాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం పీఠాధిపతి ఆచార్య ఎం. రామనాథం నాయుడు హాజరై కీలక ఉపన్యాసం చేస్తారని పేర్కొన్నారు.

ప్రశాంత జీవితం అవసరం

ప్రజాశక్తి - కడప

రాష్ట్రవ్యాప్తంగా బ్రహ్మకుమారి అక్కయ్యలు సేవలు ఎంతో ప్రశంసనీయమని, మనసుకు ప్రశాంతం ఓం శాంతి కేంద్రాలు ఎంతో అవసరమని విజయ భాస్కర్ అన్నారు. బుధవారం సాయంత్రం కడప నగరంలోని ఓంశాంతి నిలయం ను సందర్శించి ప్రజాహిత బ్రహ్మ బాబా 53 వర్ధంతి సందర్భంగా స్తూపమునకు పూలమాల వేశారు. అనంతరం అక్కయ్యలు ఓం శాంతి నూతన కేలండర్ విజయభాస్కర్‌కు బహుకరించారు.

మహిళలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి-కడప అర్బన్

నగరంలోని బాసట సేవా సంస్థ దత్తత గ్రామమైన ఎం.ఎస్. కొటాలులో శ్రీవేంకటేశ్వర ఛారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ ఎం.సి. వెంకట సుబ్బయ్య, విశ్రాంత అధ్యపకులు కలిసి బుధవారం సుమారు వందమందికిపైగా చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్ని బాగా చదివించి ప్రయోజకులను చేయాలని హితవు పలికారు. సంస్థ అధ్యక్షులు బి.వి.సుబ్బారాయుడు మాట్లాడుతూ గ్రామంలో ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగకు చీరలు పంపిణీ చేస్తామన్నారు.

ప్రమాదాలను అరికడదాం : ఎంవిఐ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్


అందరూ రహదారి భద్రతా నియమాలను పాటించి ప్రమాదాలను అరికడదామని పులివెందుల ఎంవిఐ బి.వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాలు ఈనెల 18వ తేదీ నుంచి 24 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా కడప డిటిసి ఆదేశాల మేరకు బుధవారం స్థానిక శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడపకూడదన్నారు. ముఖ్యంగా చిన్న వయసు పిల్లలకు వాహనాలు ఇవ్వకూ డదని సూచించారు. రహదారి నియమాలను పాటించడం వల్ల ప్రమా దాలను చాలా వరకు నివారించవచ్చునని ఎంవిఐ వివరించారు. మలుపుల వద్ద అతివేగంగా వెళ్లడం ఎక్కువ ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందన్నారు. అలాంటి ప్రదేశాల్లో సూచిక బోర్డులుంటాయని, వాటిని చూసి వెళ్లాలన్నారు. కారులో ప్రయాణించేవారు సీట్ బెల్ట్ ఖచ్చితంగా పెట్టుకోవాలన్నారు. ద్విచక్ర వాహనంలో వెళ్లేవారు హెల్మెట్ ధరించాలన్నారు. సెల్‌ఫోన్‌తో మాట్లాడుతూ వాహనాన్ని నడపవద్దని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నారాయణరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంవిఐ బివి ప్రసాద్

నిబంధనలు తప్పనిసరి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించాలని పులివెందుల ట్రాఫిక్ సిఐ వెంకటేశులు పేర్కొన్నారు. పట్టణంలో బుధవారం ఆయన పలుచోట్ల సిబ్బందితో వాహనాల తనిఖీ చేపట్టారు. ట్రాఫిక్ అడ్డుగా పెట్టిన పలు వాహనాలకు జరిమానా విధించారు. ఆ మేరకు ద్విచక్ర వాహనదారులు, నాలుగు చక్రాల వాహనదారులు తప్పనిసరిగా తమ వాహనాలకు సంబంధించిన పత్రాలను దగ్గర ఉంచుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. 15 కేసులకు సంబంధించి రూ.4,025 జరిమానా విధించామని సిఐ తెలిపారు.


వాహనాలను తనిఖీ చేస్తున్న సిఐ

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - చాపాడు


యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని సిద్ధ సమాధి యోగ ఆచార్యులు దేవరెడ్డి నాగ సుబ్బారెడ్డి సూచించారు. జాతీయ యువజన వారోత్సవాల్లో భాగంగా నెహ్రూ యువ కేంద్రం కడప వారి సహకారంతో బుధవారం అమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో మండలంలోని పెద్దివీడు గ్రామంలో మాల పెద్దమ్మ తల్లి దేవాలయంలో సమావేశం నిర్వహించారు. యోగా వలన కలిగే ఉపయోగాలను వివిధ ఆసనాల ద్వారా యువకులకు అవగాహన కల్పించారు. యోగా చేయడం వలన కలిగే లాభాలపై వివరించారు. కార్యక్రమంలో అమ్మ సేవా సమితి అధ్యక్షులు వాగ్గారం శివశంకర్, గ్రామ స్వరాజ్ ఏకల్ అభియాన్ వెంకటరమణ, అశోక్ కుమార్, యువకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న యోగా ఆచార్యులు

కారుకు నిప్పు : రూ.3 లక్షలు నష్టం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక గాంధీ రోడ్డులోని పాత స్టేట్ బ్యాంక్ సమీపంలోని జెండామాను వీధిలో బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని దుండగులు కారుకు నిప్పు పెట్టారు. ఈ ప్రమాదంలో కారు లోపలి భాగం పూర్తిగా ఖాళీ పోయిందని బాధితుడు హుస్సేన్ తెలిపాడు. ఉమ్మడి కర్నూలు జిల్లా నంద్యాల పట్టణానికి చెందిన హుస్సేన్ పులివెందుల్లో శ్రీరాం ఫైనాన్స్‌లో పని చేస్తూ వేంపల్లెలోని పాత స్టేట్ బ్యాంక్ వీధిలో నివాసం ఉన్నాడు. రోజూ లాగే రాత్రి బాధితుడు హుస్సేన్ తన ఇంటి ముందు కారు పెట్టాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి బయట ఉన్న కారు అద్దాలు పగుల గొట్టి పెట్రోల్ పోసి నిప్పు పెట్టడంతో పెద్ద శబ్దం వచ్చిందని, బయటికి వచ్చి చూసేలోపు కారు కాలిపోతోందని స్థానికులు తెలిపారు. ఈ విషయాన్ని కారు యజమానికి తెలిపామన్నారు. మంటలు అదుపు కాకపోవడంతో కారులో ఉన్న బియ్యం బస్తాలు కాలిపోయినట్లు బాధితుడు పేర్కొన్నాడు. ఈ సంఘటనలో దాదాపు రూ.3లక్షలు నష్టం వాటిల్లిందని హుస్సేన్ వాపోయాడు. అంతకుముందు రోజే ఈ ప్రాంతంలో స్కూటీ కూడా నిప్పు పెట్టారు. వరుస సంఘటనలతో యజమానులు ఇంటి బయట వాహనాలు పెట్టాలంటే హడలిపోతున్నారు. రాత్రి వేళల్లో మోటర్ బైకులో ఉన్న పెట్రోల్ కూడా దొంగిలిస్తున్నట్లు ప్రజలు వాపోతున్నారు. రాత్రి వేళల్లో పోలీసుల గస్తీ ముమ్మరం చేయాలని పలువురు కోరుతున్నారు. కారుకు నిప్పు పెట్టిన విషయం తెలుసుకున్న పోలీసులు ఆ ప్రాంతాన్ని పరిశీలించి, స్థానికులతో మాట్లాడారు.


కాలిపోయిన కారు

పొట్టిపాడు రోడ్డులో మూడు గడ్డివాములు..

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్): రూరల్ పరిధిలోని పొట్టిపాడు రోడ్డు ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద ఎ.నాగేశ్వర్‌రెడ్డికి చెందిన మూడు గడ్డివాములు బుధవారం అగ్నికి కాలిపోయాయి. దాదాపు రూ.2లక్షలు నష్టం సంభవించినట్లు యజమాని తెలిపారు. ప్రొద్దుటూరు, జమ్మలమడుగు అగ్ని మాపక కేంద్రం అధికారులు అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు అని జిల్లా సహాయ అగ్ని మాపక అధికారి రఘునాథ్ పేర్కొన్నారు. లీడింగ్ ఫైర్‌మెన్లు అన్వర్‌బాషా, సాంబశివారెడ్డి, ఫైర్‌మెన్లు హరికృష్ణ, రాజశేఖర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, చిన్నయ్య పాల్గొన్నారు.


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

సంక్షేమ పథకాల ప్రదాత సిఎం జగన్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మార్చిలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రామచంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కృష్ణ, గుంటూరు ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి కోరారు. మిట్ట మల్లేశ్వరస్వామి కళ్యాణ మండపంలో బుధవారం ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాల ప్రదాత సిఎం జగన్ అని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న రవీంద్రారెడ్డికి కూడా మద్దతివ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి వైఎస్ మనోహర్‌రెడ్డి, సివిల్ సప్లయ్ డైరెక్టర్ వలి గంగాధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు జగన్నాథరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎంపీ

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రజల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకుందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ముత్తుకూరులో బుధవారం గడపగడపకు మనప్రభుత్వం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ గ్రామంలో ప్రతి ఇంటికెళ్లి ప్రభుత్వ సంక్షేమాన్ని వివరించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం ఆర్థికంగా ఉంటుందన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న జగన్ ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఆయన కోరారు. గ్రామాభివృద్ధికి పనులు చేపట్టేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. వృద్ధులకు పింఛన్లు మంజూరు చేస్తామన్నారు. పింఛన్ల రద్దుపై పుకార్లను నమ్మవద్దని ఎంపీ సూచించారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సాకే శ్రీనివాసులు భౌతికాయం వద్ద నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులకు ఎంపీ ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి, ఎంపిపి లక్ష్మిగాయత్రి, విద్యుత్ ఎడిఇ శ్రీకాంత్, ఎంపిటిసి చంద్రరెడ్డి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


ముత్తుకూరులో పర్యటిస్తున్న ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డి

టిడిపి విజయానికి కార్యకర్తలు కృషి చేయాలి


సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్సీ బిటెక్ రవీంద్రానాథ్‌రెడ్డి, నాయకులు

ప్రజాశక్తి - చక్రాయపేట

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి విజయానికి కార్యకర్తలు, నాయకులు కలిసి కట్టుగా పని చేయాలని ఎమ్మెల్సీ బిటెక్ రవీంద్రానాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని నాగులగుట్టపల్లి గ్రామంలో బుధవారం పులివెందుల నియోజకవర్గస్థాయిలో టిడిపి కార్యకర్తలకు, నాయకులకు ఎమ్మెల్సీ ఆధ్వర్యంలో ఆర్‌టిఎస్ శిక్షణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌టిఎస్ ప్రతినిధులు కార్యకర్తలకు, నాయకులకు పలు సూచనలిచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ బిటెక్ రవీంద్రానాథ్‌రెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ఈ ప్రభుత్వంలో రైతులు, ఉద్యోగులు, ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ధరలు పెంచి సామాన్య ప్రజలపై ఆర్థిక భారాలు మోపారని ఆయన విమర్శించారు. టిడిపి సోషయల్ మీడియా సభ్యులు కూడా చురుగ్గా వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలపాలన్నారు. గ్రూపు రాజకీయాల్లేకుండా ఐక్యగా పనిచేయాలని కోరారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలో జరగబోయే పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలతో ఈ ప్రభుత్వ పతనానికి కార్యకర్తలు నాంది పలకాలన్నారు. ముందుగా నందమూరి తారక రామారావు చిత్ర పటం వద్ద రవీంద్రనాథ్‌రెడ్డి, టిడిపి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పార్థసారథిరెడ్డి, చక్రాయపేట టిడిపి మండల కన్వీనర్ తాళ్లపల్లి మహేశ్వరరెడ్డి, వేంపల్లె మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఆఫీస్ ట్రైనర్లు పరమేశ్వర్‌రెడ్డి, ఐటీడీపి నరసింహ, ఆయా మండలాల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరును అగ్రగామిగా నిలపడమే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

అభివృద్ధిలో ప్రొద్దుటూరును అగ్రగామిగా నిలపడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. వైయస్సార్ ఇంజనీరింగ్ కళాశాలలో రూ.65 కోట్లతో మొదటి దశ అభివృద్ధి పనులకు బుధవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైయస్సార్ పుణ్యాన ఈ కాలేజి ఏర్పాటైందన్నారు. 14ఏళ్లు సిఎంగా ఉన్న చంద్రబాబు రూ.14వేలు కూడా కాలేజి అభివృద్ధికి కేటాయించలేదన్నారు. కాలేజీ వసతుల కల్పనకు మొత్తం వ్యయం రూ.165 కోట్లుకాగా, మొదటి దశలో రూ.65 కోట్లు సిఎం విడుదల చేశారన్నారు. మొదటి దశ నిర్మాణ పనులు పూర్తికాగానే రెండోదశకు సంబంధించిన రూ.100కోట్లు విడుదల చేస్తామని సిఎం పేర్కొన్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారురెడ్డి, రాష్ట్ర ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీ రాజారామ్‌రెడ్డి, పద్మశాలియ కార్పొరేషన్ చైర్ పర్సన్ జింకా విజయలక్ష్మి, ఎంపిపి సానబోయిన శేఖర్ యాదవ్, కొత్తపల్లి పంచాయతీ సర్పంచు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, జిల్లా ప్రచార కన్వీనర్ కల్లూరు నాగేంద్రరెడ్డి, గోపవరం పంచాయతీ సర్పంచు గద్దె మోష, ఉప సర్పంచు రాఘవేంద్రారెడ్డి, కాలేజి యాజమాన్యం, మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వైసిపి ముఖ్య నాయకులు, మహిళ నాయకులు పాల్గొన్నారు.


భూమిపూజలో ఎమ్మెల్యే రాచమల్లు, నాయకులు

తెలుగు జాతికి రాజకీయం నేర్పిన ఎన్‌టిఆర్

కడప అర్బన్ : విశ్వ విఖ్యాత నట సార్వభౌముడు మరణించి 27 సంవత్సరాలు పూర్తి అయినప్పటికీ తెలుగు ప్రజల మనసులో చిరస్మరణీయుడుగా, ధ్రువతారగా ఎన్టీ రామారావు స్థిరంగా ఉన్నారని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అక్బర్ అన్నారు. బుధవారం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బయ్య, దర్బార్, సుబ్రహ్మణ్యం,దస్తగిరి, అజ్మతుల్లా, మని పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు టిడిపి నాయకుల నివాళి.. నగరంలోని ఎన్టీఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసుల రెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి అమీర్ బాబు, నగర అధ్యక్షులు సానపురెడ్డి శివ కొండారెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి ఎస్. గోవర్ధన్ రెడ్డి, బి. హరి ప్రసాద్, తెలుగు రైతు నాయకుడు లక్ష్మిరెడ్డి, కార్పొరేటర్ ఉమాదేవి మాట్లాడారు. అనంతరం నందమూరి అభిమానులు రక్తదానం చేశారు. బుర్రి రెడ్డయ్య, అమీర్‌బాబు ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో 49 డివిజన్ టిడిపి కార్పొరేటర్ జి.ఉమాదేవి, రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి సానపు రెడ్డి రవిశంకర్ రెడ్డి, టిడిపి నగర ప్రధాన కార్యదర్శి జలతోటి జయకుమార్, మేకల వేంకటేష్ యాదవ్,అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు, సుధాకర్ యాదవ్, షేక్. జిలాని బాషా, నక్కల శివరామ్, రాష్ట్ర నాయకులు యాటగిరి రాంప్రసాద్, సిఎస్ నాసర్ ఆలీ,జింక శ్రీనివాసులు, వరప్రసాద్, టిడిపి క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు పేనుబాల ప్రేమ్‌కుమార్, కొండా సుబ్బయ్య, లింగాల, శివశంకర్ రెడ్డి, గంగాధర యాదవ్, ఓబులేసు, కోండేటి జనార్ధన్ రెడ్డి, సంధా నరేంద్ర కుమార్, మమ్మద్ ఆలీ, వరదా కిరణ్ యాదవ్, మురికినాటి రామంజనేయులు, బండి జయశేఖర్, ఖాజాపీర్, తెలుగు మహిళ నాయకురాలు మురికినాటి సునీతా,పెయ్యల ప్రణవతి,టి డి పి నగర నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వేముల : తెలుగుదేశం పార్టీని స్థాపించి తెలుగు జాతికి రాజకీయాన్ని నేర్పిన నాయకుడు నందమూరి తారక రామారావు అని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పేర్ల పార్థసారథిరెడ్డి పేర్కొన్నారు. ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కడప పార్లమెంట్ ఉపాధ్యక్షులు తూగుట్ల రాఘవరెడ్డి, మండల అధ్యక్షులు బ్రహ్మయ్య, పెర్నపాడు చిన్న అంకిరెడ్డి, మాజీ మండలాధ్యక్షులు ఓబయ్య, ఓబుళరెడ్డి యాదవ్, మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి భాస్కర్‌రెడ్డి, యేసు, నారేపల్లె రమణారెడ్డి, సత్యమారెడ్డి, గొల్లలగుడూరు రవి, రాచకుంటపల్లె ఓబులేసు, విశ్వేశ్వరరెడ్డి, హనుమంత్‌రెడ్డి, మైసూరారెడ్డి, కొత్తపల్లె రమణారెడ్డి, చాగలేరు క్లస్టర్ ఇన్‌ఛార్జి గంగాధర రెడ్డి, వేముల క్లస్టర్ ఇన్‌ఛార్జి శివరాం, చింతలజుటూరు క్లస్టర్ ఇన్‌ఛార్జి చిన్నిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మైదుకూరు : మాజీ ముఖ్యమంత్రి, టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు వర్ధంతిని స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో దాసరి బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి పూల మాలతో ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ధనపాల జగన్, అన్నవరం సుధాకర్‌రెడ్డి, మేకల బాబు, యాపరాల లక్ష్మీ నారాయణ, పాల మాబు, పాశం మారుతి, కుర్రా రాధా, ధనపాల రవి, మాదం రమణ, మాచనురు సుబ్బారాయుడు, గాలి వెంకటసుబ్బయ్య, పాశం సుధాకర్, జండాలు మాబు, రాకెట్ రఫీ, ప్రభాకర్, ముడియం ప్రసాద్, నాగప్రసాద్, గంజికుంట సర్పంచు జయభరత్‌రెడ్డి, మేకల సుదర్శన్, బండి అమర్, గంగారపు చంద్ర, నాదెండ్ల పీరా, డిసి ఓబయ్య, పసల సుందరం, నారపురెడ్డి, షరీఫ్, వెంకట్‌రెడ్డి, నాగేష్, టిఎన్‌ఎస్‌ఎఫ్ గంగాధర్, నాగపట్నం రామసుబ్బయ్య, నాయకులు, నందమూరి అభిమానులు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

ముద్దనూరు : మాజీ ముఖ్యమంత్రి పద్మశ్రీ డాక్టర్ ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా టిడిపి జమ్మలమడుగు ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం భూపేష్ రెడ్డి, కార్యకర్తలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌సి శివనాథ్‌రెడ్డి, టిడిపి నాయకులు అశోక్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, మాజీ సర్పంచు శివరామిరెడ్డి, నాయకులు రంగారెడ్డి, ఖాలుఖాన్, భాస్కర్ రెడ్డి, సత్తార్, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : బడుగు బలహీనుల మనసులో చిరస్మరణీయులుగా నిలిచిన మహానేత నందమూరి తారక రామారావు అని టిడిపి ఇన్‌ఛార్జి జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్ పరిధిలోని బైపాస్ రోడ్డులోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు ఇవి సుధాకర్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి షేర్ అలీ, రూరల్ మండల కన్వీనర్ బోడెల బాబుల్‌రెడ్డి, రాజుపాలెం మండలం కన్వీనర్ ధనిరెడ్డి విశ్వనాథరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బండి విజయభాస్కర్‌రెడ్డి, రాష్ట్ర రైతు ఉపాధ్యక్షుడు కసిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి తాటి శ్రీనివాసుల యాదవ్, సిద్దయ్య కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వేంపల్లె : టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహ్మద్ షబ్బీర్ కార్యాలయంలో బుధవారం ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పార్థసారథిరెడ్డి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి తెలుగు రైతు జిల్లా అధ్యక్షులు బాలస్వామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు జగన్నాథరెడ్డి, మండల మాజీ కన్వీనర్ వెంకటసుబ్బారెడ్డి, మైనార్టీ కన్వీనర్ తెలంగాణ వలి, యాసిన్, పివి రమణ, నల్లగారి రామకృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షులు ఆర్‌వి రమేష్, యాసిన్, ఇలియాస్, గౌస్, గొటూరు నాగభూషణం, రామ సుబ్బారెడ్డి, మల్లి, అల్లాబక్ష్, తిప్పారెడ్డి, మాజీ దేవస్థానం చైర్మన్లు ఎద్దుల కొండయ్య, వెంకటస్వామి, రాజారావు, గంగధర్, వెంకటయ్య, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : ఆర్‌టిపిపి ఫౌంటెన్ వద్ద ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి టిడిపి శ్రేణులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో శివశంకర్‌రావు, రంగా రాంప్రసాద్, కుమార్‌రాజా, భూమిరెడ్డి శీను, కృష్ణయ్య, పొన్న చంద్ర, కుండా శ్రీను, రాజశేఖర్, సుబ్రహ్మణ్యం, శీను పాల్గొన్నారు.

వనిపెంటలో 'గడప గడపకూ'

ప్రజాశక్తి - మైదుకూరు


వనిపెంటలో బుధవారం ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇళ్లు తిరుగుతూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ప్రతి ఇంటికి బుక్‌లెట్ అందించారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ సచివాలయ పరిధిలో పలు సంక్షేమ పథకాల కింద రూ.17 కోట్లు ఇచ్చామన్నారు. రైతు భరోసా, రోడ్లు, డ్రయినేజీ, జడ్పీ హైస్కూల్ అభివృద్ధి చేశారన్నారు. తాగునీరు, సాగునీరు సమస్య లేదన్నారు. కెసి కాలువకు మార్చి ఆఖరు వరకు నీరు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల వైస్ చైర్మన్ రఘురామిరెడ్డి, జడ్పిటిసి అట్లూరి సుబ్బారెడ్డి, వనిపెంట సర్పంచ్ గౌస్ లాజన్, కటారి వీరయ్య, బిసి సెల్ నాయకుడు ఇడిగొట్టు శేషు, మూలే సుధాకర్‌రెడ్డి, అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

గత గురువారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు కూలీల, టిప్పర్ డ్రైవర్ కుటుంబాలకు బుధవారం ఒకొక్క కుటుంబానికి రూ.5లక్షలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే స్పందించి ఆర్థికసాయం అందించిందన్నారు. ఆ మేరకు సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గోరిగనూరు గ్రామానికి చెందిన ఓబులేసు కుటుంబానికి రూ.5 లక్షల చెక్కును, ధర్మాపురం గ్రామానికి చెందిన నాగసుబ్బారెడ్డి కుటుంబానికి, ఉప్పలపాడు గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ కుటుంబానికి చెరో రూ.5 లక్షల చెక్కులను అందజేశారు. మృతుల కుటుంబాలను ఆదుకోవడం ప్రభుత్వం బాధ్యత అని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ జమ్మలమడుగు ప్రాంతంపై ప్రత్యేకశ్రద్ధ చూపుతున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్ మార్బుల్ శీను, బోనం సురేష్, ఉప్పలపాడు శ్రీనివాసులురెడ్డి, గుర్రప్ప, రెవెన్యూ అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

సమస్యలు ఉంటే చెప్పండి : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గూడెం చెరువు గ్రామంలో బుధవారం ఆయన అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించి బుక్‌లెట్‌ను అందజేశారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని కోరారు. రాజీవ్‌కాలనీలో సిసి రోడ్లు నిర్మించాలని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, ఇల్లు మంజూరు చేయాలని ప్రజలు కోరగా.. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పి.నాగేశ్వర్‌రెడ్డి, పాల సంజీవ్, బిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగింజల చంద్రమౌళి, నాయకులు ఉప్పలపాటి యోబు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ కేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - ముద్దనూరు

ఆధార్ కార్డు అప్డేట్ చేసుకునేందుకు ప్రత్యేక ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ రమణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్రస్, వేలిముద్రలు, ఫోన్ నెంబర్ సవరించుకునేందుకు ప్రభుత్వం ఈనెల 19నుండి 24 వరకు అవకాశం కల్పించిందన్నారు. మండలంలోని పెనికలపాడు-1 సచివాలయానికి సంబంధించి ఈనెల 19, 20న ఉప్పలూరు ఉన్నత పాఠశాలలో, 21న నల్లబల్లె సచివాలయంలో, 23, 24న ముద్దనూరు ఉన్నత పాఠశాలలో ప్రత్యేక ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గొప్ప సంఘ సంస్కర్త విశ్వకవి వేమన

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

గొప్ప సంఘ సంస్కర్త విశ్వకవి వేమన అని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి తెలిపారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం విశ్వకవి వేమన జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సంద్భంగా విశ్వకవి వేమన చిత్రపటానికి పూల మాల వేసి తులసిరెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో మత, కుల రాజకీయాలు ఎక్కువవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో వేమన సూక్తులు, ప్రబోధాలు సమాజానికి ఎంతో అవసరమని తెలిపారు. ముందుగా ఆయన మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ చిత్ర పటానికి సతీమణి అలివేలమ్మతో కలిసి తులసిరెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ఎన్టీఆర్ యుగ పురుషుడని తులసిరెడ్డి కొని యాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, సుబ్రమణ్యం, బద్రీ, రాఘవయ్య, చెన్నకేశవ, రామకృష్ణ, నరసింహారెడ్డి, శివ, వెంకటేష్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.


వేమన చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న తులసిరెడ్డి

కనుచూపుమేరలో కనిపించని అభివృద్ధి

- జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరులో కనుచూపుమేరలో అభివృద్ధి కనపడడం లేదని టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని స్వరాజ్యనగర్ 8 వార్డులో ఇదేమి ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ నియోజకవర్గానికి ఏడాదికి రూ.500 కోట్లు తెస్తానన్న ఎమ్మెల్యే తెచ్చారా అని ప్రశ్నించారు. మోసపూరిత మాటలతో ఎమ్మెల్యే ప్రజలను మభ్యపెడుతున్నరన్నారు. ఆర్బికె టాక్స్‌తో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు కార్యక్రమంలో 8వవార్డు మాజీ కౌన్సిలర్ చెన్నయ్య, సురసుర శ్రీనివాసులు, మధు, రాజకులాయప్ప, శ్రీనాథ్, రజక సంఘం వెంకటరమణ, పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వ్యక్తిని కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి - మైలవరం

ఆత్మహత్య చేసుకోబోతున్న వ్యక్తిని బుధవారం మైలవరం పోలీసులు కాపాడారు. వివరాలిలా.. జమ్మలమడుగు మండలానికి చెందిన మంగలి పుల్లయ్య అనే వ్యక్తి అనారోగ్య సమస్యలతో మైలవరం జలాశయంలో దూకడానికి వెళుతున్నాడని అనుమానంతో అక్కడ ఉన్న ప్రజలు ఎస్ఐ రామ కృష్ణకు సమాచారమిచ్చారు. ఎస్ఐ తన సిబ్బందితో పుల్లయ్యను సురక్షితంగా పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్‌పి అన్బురాజన్ పోలీసులను అభినందించారు.